
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 17 ఏప్రిల్ 2024





	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	27	41
భద్రాద్రి	26	44


మిథిలా స్టేడియం స్వాగత ద్వారం
విద్యుత్ కాంతుల మధ్య వెలుగొందుతున్న భద్రగిరి క్షేత్రం



భద్రగిరి పులకిస్తోంది. మిథిలానగరి మురిసిపోతోంది.. జానకిరాముల కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు భక్తకోటి పరితపిస్తోంది. శ్రీరామ నవమి సందర్భంగా తరలివచ్చిన భక్తులతో భద్రాచల క్షేత్రం కోలాహలంగా మారింది. ఎటు చూసినా రామభక్తుల సందడే.. ఎక్కడ విన్నా శ్రీరామ నామ స్మరణే మారుమోగుతోంది. బుధవారం ఉదయం 10.30గంటలకు తిరుకల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకోసం భద్రాద్రి నడిబొడ్డున గల మిథిలా స్టేడియంలో సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కల్యాణాన్ని తిలకించేందుకు ప్రత్యేక సెక్టార్లు ఏర్పాటు చేశారు. స్వామి కల్యాణంతో పాటు గురువారం శ్రీరామ మహాపట్టాభిషేకం నిర్వహించనుండటంతో భద్రాద్రి భక్తాద్రిగా మారిపోయింది. భక్తులు సేద తీరేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో పట్టణంలో పలుచోట్ల షామియానాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్‌తో ఈ సారి సీఎంకు బదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్వామివారి కల్యాణంలో ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. ఇక గురువారం జరిగే శ్రీరామ మహాపట్టాభిషేకానికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హాజరు కానున్నారు.

ఆణిముత్యములు తలంబ్రాలుగా..

భద్రగిరిలో శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి

- భువిపైన జరిగే మహా వేడుకకు ముస్తాబైన భద్రాచలం
- మిథిలా స్టేడియంలో సకల ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న సీఎస్ శాంతికుమారి
- భక్తాద్రిగా మారిన దక్షిణ అయోధ్య
- రేపు శ్రీరాముడికి మహా పట్టాభిషేకం.. గవర్నర్ రాక
- పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసుశాఖ
- 600 బస్సులను నడుపుతున్న ఆర్టీసీ

భద్రాచలంలో నేడు...

తెల్లవారుజామున 2 గంటలకు దేవాలయం తెరుచుట
2 నుంచి 2.30 వరకు సుప్రభాత సేవ
2.30 నుంచి 4 వరకు తిరువారాధన, నివేదన, శాత్తుముర్రై
4 నుంచి 5 వరకు మూలవరులకు అభిషేకం
5 నుంచి 5.30 వరకు అలంకారం
5.30 నుంచి 1 గంట వరకు సర్వదర్శనం, శీఘ్ర దర్శనాలు
ఉదయం 8 నుంచి 9 వరకు మూలమూర్తులకు తిరుకల్యాణం
9 నుంచి 9.30 వరకు అలంకారం
9 నుంచి 10.30 వరకు ఉత్సవమూర్తులను ఆలయం నుంచి తీసుకెళ్లుట
10.30 నుంచి 12.30 వరకు కల్యాణ మహోత్సవం
1 నుంచి 2 వరకు మధ్యాహ్నిక ఆరాధన రాజభోగం
2 నుంచి 6 వరకు సర్వదర్శనం
6 నుంచి 6.30 వరకు ఆరాధన
6.30 నుంచి 7.30 వరకు పునర్వసు దీక్ష ధారణ
8 నుంచి 10 వరకు తిరువీధి సేవ

భద్రాచలం, ఏప్రిల్ 16: భద్రాచలంలో ఆదర్శ దంపతులు శ్రీ సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధమైంది. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు దేశ నలుమూలలనుంచి భక్తులు ఇప్పటికే భద్రాద్రికి చేరుకున్నారు. కల్యాణ తంతు నిర్వహించే మిథిలా స్టేడియంలో భక్తుల కోసం చాందినీ వస్త్రాలతో నీడ ఏర్పాటు చేశారు. కల్యాణ మండపాన్ని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. సీతారాముల కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి సమర్పించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె భద్రాచలం చేరుకొని జిల్లా అధికార యంత్రాంగంతో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సమీక్ష చేశారు. అలాగే నవమికి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం ఉదయం 10.30గంటలకు తిరుకల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో కల్యాణం నిర్వహిస్తారు.

విస్తృత ఏర్పాట్లు... శ్రీరామ నవమి ఉత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం దేవస్థానం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. సమాచార కేంద్రాలు, ప్రథమ చికిత్సా కేంద్రాలను, సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత క్లాక్‌రూంలు ఏర్పాటు చేశారు. తాగునీరు, పులిహోర పొట్లాల పంపిణీ చేయనున్నారు. విద్యుత్‌దీపాల వెలుగులో దేవస్థానం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఈసారి నవమికి రెండు రాష్ట్రాల నుంచి 600బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల కోసం 2.50 లక్షలకు పైగా లడ్డూలను సిద్ధం చేశారు. దివ్యాంగుల కోసం 25 వీల్‌చైర్లు, అత్యవసర చికిత్సా కేంద్రాలు 25, ఉచిత తలంబ్రాల పంపిణీ కేంద్రాలు 60, ప్రసాదాల విక్రయ కౌంటర్లు 19 ఏర్పాటు (మిగతా 7వ పేజీలో)




సీఎస్ శాంతికుమారి


పీఎస్ శైలజ రామయ్యర్

సందడిగా ఎదుర్కోలు

- ఆహ్లాదకరంగా మాలికా పరివర్తనం
- పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎస్ శాంతి కుమారి, దేవాదాయ శాఖ పీఎస్ శైలజ రామయ్యర్

భద్రాచలం, ఏప్రిల్ 16: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామచంద్రస్వామికి మంగళవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకిపై కొలువుతీర్చి ప్రధాన ఆలయం నుంచి మంగళ వాయిద్యాలతో మిథిలా స్టేడియం ముఖద్వారం వద్దకు తీసుకొచ్చారు. వైకుంఠద్వారం వద్ద రామచంద్రుడిని మిథిలా స్టేడియం ద్వారం వైపు సీతమ్మను ఎదురెదురుగా ఆసీనులను చేశారు. రామచంద్రుడి వైపు దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, సీతమ్మ వైపు స్థానాచార్యులు కేఈ స్థలశాయి వివరించారు.

వర్ణనా కార్యక్రమం తరువాత రామయ్య సీతమ్మల తరపున, సన్నాయి మంగళవాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేస్తూ మాలా పరివర్తన కార్యక్రమాన్ని ఆహ్లాదకరంగా నిర్వహించారు. ఈ సమయంలో భక్తుల కరతాళ ధ్వనులు అంబరాన్నంటాయి. అనంతరం సీతారామచంద్రులను పక్కపక్కన ఆసీనులను చేసి ప్రత్యేక హారతిని సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. దేవాదాయ శాఖ తరపున ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్ పట్టువస్త్రాలు సమర్పించారు. చివరగా శ్రీ సీతారామచంద్రస్వామిని తిరువీధికు తీసుకెళ్లారు.

అనంతరం భద్రాద్రి రామయ్యను సీఎస్ శాంతికుమారి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (పీఎస్) శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ప్రత్యేకపూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. దేవస్థానం తరపున శాలువ, జ్ఞాపికను ఈవో రమాదేవి అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దివంగత ప్రముఖ నటుడు కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి పాల్గొన్నారు.


ఎదుర్కోలు సందర్భంగా మాలికా పరివర్తనం


ఖమ్మంలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

కలిసికట్టుగా 'గులాబీ' జెండా ఎగురవేద్దాం...

- కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దు...
- అందరం అండగా ఉంటాం
- బీఆర్ఎస్ నేతలు నామా, వద్దిరాజు, పువ్వాడ
- ఖమ్మం నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం

7


మృతురాలు చల్లా పుష్ప

పురుగుల మందు తాగిన దంపతులు

- భార్య మృతి, భర్తపరిస్థితి విషమం
- కల్లూరులో విషాదం
- ఆత్మహత్యకు ఇంకా తెలియరాని కారణాలు

7

ఐపీఎస్ అయిన కానిస్టేబుల్ కుమార్తె

- సివిల్స్‌లో సాయి అలేఖ్యకు 938వ ర్యాంకు
- స్వగ్రామం గోవిందాపురం(ఎల్)లో సంబరాలు
- ఐదో ప్రయత్నంలో వరించిన విజయం

బోనకల్, ఏప్రిల్ 17: కల గనడం కాదు, ఆ కలను సాకారం చేసుకునే పట్టుదల ఉంటే ఏదైనా పాదాక్రాంతం అవుతుందని నిరూపించారు ఆమె. పరిస్థితులు అనుకూలించక పోయినా, ఏటికి ఎదురీదే బలమైన కాంక్ష ఉంటే కోరుకున్న శిఖరాలను చేరుకోవచ్చని ఆమె చాటిచెప్పారు. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన రావూరి సాయి అలేఖ్య సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 938వ ర్యాంకు సాధించి ఖమ్మం జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేశారు. ఎస్టీ వర్గానికి చెందిన సాయి అలేఖ్యకు ఐపీఎస్ కేడర్ దక్కుతుందని భావిస్తున్నారు.

సాయి అలేఖ్య తండ్రి రావూరి ప్రకాశరావు మధిరలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గత ఏడాది మే 28న నిర్వహించిన యుపీఎస్సీ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి, అదే ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన మెయిన్స్‌లో, ఈ ఏడాది జనవరి, ఏప్రిల్ నెలల్లో పలు దశల్లో నిర్వహించిన వ్యక్తిగత ఇంటర్వ్యూలో అత్యుత్తమ ప్రతిభను చాటారు. సాయి అలేఖ్య చిన్న నాటి నుంచే ఐఏఎస్ ఆశయ సాధన వైపుకు గురి పెట్టారు. టెన్త్ వరకు ఖమ్మంలోని ప్రైవేటు విద్యాసంస్థలో, ఇంటర్ విజయవాడలో, డిగ్రీ విద్యను హైదరాబాద్ ఉస్మానియాలో, పీజీ విద్యను బెనారస్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. పీజీ చదువుతుండగానే యూపీఎస్సీ పరీక్షలు రాయడం ప్రారంభించారు. మొదటి నాలుగు ప్రయత్నాల్లో విఫలమైనా, మొక్కవోని ఆత్మ విశ్వాసంతో కష్టపడి చదివి 5వ ప్రయత్నంలో లక్ష్యాన్ని ఛేదించారు. క్రమశిక్షణ, పట్టుదల, సంకల్పం వంటబట్టించుకున్న తన కుమార్తె ఐపీఎస్ క్యాడర్‌కు ఎంపిక కావడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తండ్రి ప్రకాశరావు తెలిపారు. సాయి అలేఖ్య విజయంతో స్వగ్రామం గోవిందాపురం(ఎల్)లో సంబరాలు అంబరాన్ని అంటాయి.


తల్లిదండ్రులతో సాయి అలేఖ్య

నాటి కలెక్టర్ ఉషారాణి ప్రేరణతోనే.. 7

ఇద్దరు ఉద్యోగులపై వేటు

- కోడ్ ఉల్లంఘించి రాజకీయ ప్రకటన ఇవ్వడంపై కలెక్టర్ చర్య

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 16: ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉల్లంఘించి రాజకీయ నేతలకు శుభాకాంక్షల ప్రకటన ఇచ్చిన ఇద్దరు ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ సస్పెన్షన్ వేటు వేశారు. టీఎన్జీవో నాయకులు షేక్ అఫ్జల్‌హాసన్, ఆర్వీఎస్ సాగర్ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఓ పత్రికకు ప్రకటన ఇచ్చారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పత్రికకు సీఎంతో పాటు మంత్రుల చిత్రాలతో ఆ ప్రకటన ఇచ్చినట్లు కొంత మంది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో విచారణ నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వీపీ గౌతమ్ ఆ ఇద్దరినీ సస్పెండ్ చేస్తు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఉద్యోగులు ఎన్నికల కోడ్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు.



వైరా సెగ్మెంట్‌లో బీఆర్ఎస్‌కు షాక్

రాజీనామా యోచనలో మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ 7


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి గౌతమ్

నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు

- రేపు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- వెనువెంటనే నామినేషన్ల స్వీకరణ
- అభ్యర్థులు నిబంధనలను కూలంకషంగా తెలుసుకోవాలి
- సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు
- ఖమ్మం లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ పేర్కొన్నారు. ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందని, అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ వివరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సునిల్‌దత్‌తో కలిసి ఆయన మాట్లాడారు.


ఈనెల 18నుంచి25వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన జరుగుతుందని, మే 13న లోక్‌సభ ఎన్నికల నిర్వాహణ, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగుతుందని కలెక్టర్ వివరించారు. కలెక్టరేట్‌లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని రిటర్నింగ్ ఆఫీసర్ చాంబర్‌లోనే నామినేషన్లు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్ పత్రాలలో పొరపాట్లు జరగకుండా సహాయం అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు.

ఖమ్మం నియోజకవర్గానికి చెందని ఓటర్లు ఖమ్మం నుంచి పోటీచేయాల్సి వస్తే తాము దేశంలో ఏ లోక్‌సభ నియోజకవర్గంలోని ఓటరో సంబంధిత ఎన్నికల అధికారి వీఆర్వోనుంచి ధృవీకరణ పత్రం తీసుకురావాల్సి ఉంటుదని తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన వారు ఎన్నికల్లో పోటీచేస్తే ఒకరు మాత్రమే ప్రతిపాదించాల్సి ఉంటుందని, స్వతంత్రులుగా పోటీచేస్తే పదిమంది ప్రతిపాదించాలని వీరంతా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఓటర్లుగా ఉండాలని తెలిపారు. రాజకీయ పార్టీ తరపున నామినేషన్ వేసి ఆ పార్టీ తరపున బీ-ఫారం రాని పక్షంలో పది మంది నామినేషన్‌పై బలపరిస్తే అతను స్వతంత్ర అభ్యర్థిగా రంగంలో దిగే అవకాశం ఉంటుందని, ఒకరు మాత్రమే బలపరిస్తే తిరస్కరణకు గురవుతుందని ఇది అభ్యర్థులు గమనించాలన్నారు.

నామినేషన్ల సందర్భంగా కలెక్టరేట్‌లోకి ఇతరులు ఎవరిని అనుమతించబోమని, ఉద్యోగులు, అధికారులను గుర్తింపు కార్డుల ద్వారా అనుమతించడం జరుగుతుందని, సాధారణ ప్రజలు, అర్జీదారులు నామినేషన్ సందర్భంగా కలెక్టరేట్ వద్దకు రావద్దని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులకు సంబంధించి మూడు వాహనాలు మాత్రమే అనుమతించబడతాయని మిగిలిన వాహనాలు వంద మీటర్ల దూరంలో నిలపాల్సి ఉంటుందన్నారు. ప్రతిపాదించే ఓటర్లను కూడా అభ్యర్థుల వెంట తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. ఈనెల 17న వ్యయ పరిశీలకులు, 23న సాధారణ, పోలీసు పరిశీలకులు జిల్లాకు రానున్నారని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలున్నందున అక్కడ ఉదయం 7గంటలకు మొదలై సాయంత్రం 4గంటలకే ముగుస్తుందని, ఖమ్మంజిల్లా పరిధిలోని 5 నియోజకవర్గాల్లో మాత్రం ఉదయం 7గంటలకు మొదలై సాయంత్రం 5గంటలకు ముగుస్తుందన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో 1084 పోలింగ్ కేంద్రాలున్నాయని, 16,26,427మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటర్ల మార్పులు, కొత్త ఓటర్లు చేర్పులతో ఈనెల 25న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నామని తెలిపారు.

పోలీసు కమిషనర్ సునిల్‌దత్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయని, ఎస్ఎస్‌టీ టీంలు ఈనెల 18 నుండి పనిచేయనున్నాయని తెలిపారు. ఇప్పటికే 102 కేసులు నమోదయ్యాయని, 96 మద్యం కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. రూ.కోటి 50 లక్షల నగదు సీజ్ చేశామని తెలిపారు. నామినేషన్లకు పకడ్బందీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, బెదిరింపులకు ప్రలోభాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. లోక్‌సభ నియోజకవర్గంలో 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో అంతర్గత రహదారుల మధ్య 7 చోట్ల తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, నిర్మల్‌శ్రేష పాల్గొన్నారు.






సీతమ్మకు చేయిస్తీ.. చింతాకు పతకం..

- రామయ్యకు 67 కేజీల స్వర్ణం, 980 కేజీల రజతం
- నేటికీ భక్తరామదాసు చేయించిన ఆభరణాలతోనే కల్యాణం

భద్రాచలం ఏప్రిల్ 16: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి ప్రస్తుతం 67కిలోల 774 గ్రాముల, 552 మిల్లీగ్రాముల స్వర్ణంతో పాటు 980 కిలోల 682 గ్రాముల, 513 మిల్లీ గ్రాముల రజితం ఉంది. కాగా స్వామి వారి కల్యాణ సమయం, ముఖ్య ఉత్సవాల సమయంలో భక్తరామదాసుగా పేరుగాంచిన కంచర్ల గోపన్న చేయించిన బంగారు ఆభరణాలనే వినియోగిస్తారు. వజ్రాలు, పొదిగి, విలువైన పచ్చలు వేలాడగట్టిన సుందరమైన పచ్చల పతకం, కెంపులు పొదిగి ముత్యాలతో వేలాడే చింతాకు పతకం, పచ్చలు పొదిగిన పచ్చల పతకం, కిరీటంలో అలరించే వజ్రాలు పొదిగిన కలికితురాయి తదితర విలువైన ఆభరణాలు భక్తరామదాసు చేయించారు. భక్తరామదాసును తానీషా నవాబు కారాగారంలో బంధించిన సమయంలో ఆలపించిన కొన్ని కీర్తనల్లో ఈ నగల ప్రసక్తి ఉండటం విశేషం. ఇక్ష్వాకుల తిలక ఇకనైన పలకవే రామచంద్రా.. అనే కీర్తనలో సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా.. ఆ పతకమునకు పట్టే పదివేల వరహాలు రామచంద్రా అంటూ ఆ క్రోశిస్తూ కలికితురాయి నీకు పొలుపుగా చేయిస్తి, రామచంద్రా.. నీవు కులుకుతూ తిరిగేవు ఎవడబ్బ సొమ్మని రామచంద్రా అని తిరిగి తన తప్పులు తెలుసుకున్న భక్తరామదాసు అబ్బ తిట్టితినని అయాసపడవద్దు రామచంద్రా ఈ దెబ్బల కోర్వక అబ్బ తిట్టితినయ్యా రామచంద్రా... అని వాపోయారు. రామునికి రామదాసు చేయించిన ఆభరణాలనే నేటికీ ధరింపజేస్తారు. రామదాసును చెరసాల నుంచి విడిపించడానికి తానీషా నవాబుకు రామ లక్ష్మణులు సమర్పించారన్న బంగారు రామమాడ నాణాలు కొన్ని ఈనాటికీ భద్రాద్రి ఆలయంలోనే ఉన్నాయి. రామటెంకిగా పిలిచే ఈ నాణెంపై దేవనాగరి లిపిము ద్రించి ఉంది. కల్యాణం రోజున రాముల వారు ధరించే రవ్వల వైరముడి, మధ్యలో గల నీలపురాయి మద్రాసుకు చెందిన వేశ్య శ్రీరామునికి సమర్పించిందని కథనం. తూము నర్సింహదాసు స్థిరీకరించిన మహారాజ సేవోత్సవం సందర్భంగా ఆయన రాసిన ఒక కీర్తన పూజ సేయరే స్వామికి బంగారు పూలతో పూజ సేయరే స్వామికి అన్న దానికి అన్వయిస్తూ చిన జీయర్‌స్వామి 108 బంగారు పుష్పాలను సమర్పించారు. సీతమ్మ వారికి, రాముల వారికి కంకణాల అలంకరణకు సయ్యద్ మీరా అనే ముస్లిం భక్తుడు బంగారు తోడాలు ఇచ్చారు. భక్తరామదాసు 30 తులాలతో చేయించిన మూడు బంగారు మంగళ సూ త్రాలతోనే సీతమ్మ వారికి సూ త్రధారణ జరుగుతుంది. ఆ తర్వాత కూడా చాలా మంది భక్తులు స్వామికి ఎన్నెన్నో ఆభరణాలు, అలంకారాలు చేయించారు. విశాఖపట్టణానికి చెందిన పద్మజారెడ్డి స్వామి ఊంజల్ సేవకు బంగారు ఊయలను బహుకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంకు చెందిన రామస్వామి అనే భక్తుడు బంగారు గొడుగును రామపాదుకలను సమర్పించారు. బీసీసీఐ మాజీ చైర్మన్, ఇండియా సిమెంట్స్ ఎండీ శ్రీనివాసన్ భద్రాద్రి రామాలయంలో రూ.40 లక్షలతో రామాలయంలో బంగారు వాకిలి తయారు చేయించారు. 2024 ఫిబ్రవరిలో భద్రా ద్రి దేవస్థానం అధికారులు 103 కేజీలతో అంతరాలయ ప్రవేశ ద్వారానికి వెండి వాకిలి ఏర్పాటు చేశారు.



తానీషా నుంచి అదే సంప్రదాయం

- 1973లో శ్రీకారం చుట్టిన అప్పటి సీఎం జలగం వెంగళరావు
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన తొలి గవర్నర్ నరసింహన్

భద్రాచలం, ఏప్రిల్ 16: భద్రాద్రి రామయ్య కల్యాణానికి అనాధిగా సంప్రదాయంగా ముత్యాల తలంబాలు, పట్టు వస్త్రాలను తేవడం జరుగుతోంది. తొలుత ఈ సంప్రదాయానికి తానీషాగా ప్రసిద్ధిగాంచిన అబుల్ హసన్ కుతుబ్‌షా దక్షిణ భారతదేశంలో గోల్కొండను పాలించిన కుతుబ్‌షాహీ వంశానికి చెందిన ఏడో, చివరి చక్రవర్తి. అలాగే తానీషా అబ్దుల్లా కుతుబ్‌షా మూడో అల్లుడు. ఈయన 1672 నుంచి 1687 వరకు గోల్కొండను పాలించారు. గోల్కొండ ఏడో నవాబు హయాంలో రామయ్యకు ముత్యాల తలంబ్రాల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. ఇందుకు నైజాం నవాబు తానీషా శ్రీకారం చుట్టారు. అనంతరం భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్లిన తరువాత తొలినాళ్లలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి లేదా దేవాదాయ శాఖ కమిషనర్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించేవారు. 1973లో అప్పటి ముఖ్యమంత్రి, జిల్లాకు చెందిన జలగం వెంగళరావు సీఎం పట్టు వస్త్రాలు తెచ్చే సంప్రదాయానికి నాంది పలికారు. నాటి నుంచి నేటి వరకు ఎందరో ముఖ్యమంత్రులు స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం డా. మర్రి చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య, భవనం వెంకటరామిరెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబునాయుడు, డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి, కొణిజేటి రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం తరపున పలు మార్లు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇందులో చంద్రబాబునాయుడు అందరి కంటే ఎక్కువగా అత్యధిక సార్లు రామయ్యకు సమర్పించడం విశేషం. కాగా కొన్ని సమయాల్లో అనివార్య పరిస్థితుల కారణంగా ఎన్టీ రామారావు, చంద్రబాబు, డా. వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ముత్యాల తలంబాలను సమర్పించేందుకు రాలేకపోయారు. 2009లో జరిగిన ఎన్నికల సమయంలో నవమి రావడంతో ప్రోటోకాల్ సమస్య కారణంగా అప్పటి రెవెన్యూ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి వీరభద్రయ్య రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కాగా 2015, 2016లో సీఎం కె.చంద్రశేఖర్‌రావు దంపతులు రామయ్యకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. 2017లో అప్పటి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు సమర్పించిన గవర్నరుగా ఆయన రికార్డు సృష్టించారు. 2018 నుంచి 2023 వరకు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తూ వచ్చారు.

కాగా తాజాగా 2024లో ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున రామయ్య కల్యాణంలో సమర్పించనున్నారు.



రామయ్య కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున తలంబ్రాలు సమర్పించిన తొలి గవర్నర్ నరసింహన్ (ఫైల్)

సుదర్శన దర్శనంతో ఆపదల నుంచి రక్షణ



భద్రాచలం, ఏప్రిల్ 16: పరమ పావనము భద్రాచల పుణ్యక్షేత్రము.. ఇక్కడ సీతారామ ప్రభువు నెలకొన్న గర్భాలయంపై ప్రతిష్ఠించిన సుదర్శన చక్రాన్ని దర్శిస్తే సకల రోగాలు నివారణ అవడంతో పాటు ఆపదల నుంచి రక్షణ పొందవచ్చని భక్తుల ప్రగాడ విశ్వాసం. శ్రీ సీతారామచంద్ర స్వామి ఇక్కడ స్వయం భూ అయినట్లే సుదర్శనం కూడా స్వయంభూ కావడం ఈ క్షేత్ర విశేషం. భక్తరామదాసు రామునికి ఆలయం నిర్మించిన తరువాత గర్భాలయంపై శిఖర ప్రతిష్ఠ చేశారట. పెనుగాలికి ఆ శిఖరం కదిలిపోయేదట. ఇలా అనేకసార్లు జరగడంతో ఈ సంఘటనకు ఆయన మనస్సు బాగా కలత చెంది బాధతో శ్రీ రామచంద్రున్ని ఆయన ప్రార్థించారు. దీంతో ఒక నాడు ఆయన గోదావరిలో స్నానం చేస్తుండగా ప్రవాహంలో దగ దగ మెరిసే సుదర్శనం ఆయన చేతికి అందింది. ఆ సుదర్శనంనే శిరస్సున ఉంచుకొని ఆలయానికి తెచ్చి గర్భాలయ శిఖరంపై రామదాసు ప్రతిష్ఠించారు. అందుకే భక్త రామదాసు ఇదిగో భద్రాద్రి గౌతమి.. అదిగో చూడండి అనే కీర్తనలో అనుపమానమై అతి సుందరమై దనరు చక్రమున ధగ.. ధగ మెరసెడి అదిగో భద్రాద్రిగౌతమి ఇదిగో చూడండి ఆ సుదర్శన చక్రాన్ని అనుపమానమని కీర్తించారు. ఈ సుదర్శనంలో ఉండే గొప్పతనం వర్ణింపజాలనది. ఆ ఒక్క సుదర్శనంలో ఎనిమిది వైపుల ఎనిమిది విడివిడి చక్రాలు దర్శనమిస్తాయి. అంటే మొత్తం తొమ్మిది చక్ర చిహ్నాలు ఉన్నట్లుగా గుర్తించాలి. అష్టకోణంతో సుమారు ఆరు అడుగుల సుదర్శన చక్రం శతదళ పద్మ శోభితంగా వెలుగొందుతోంది.. ఆ సుదర్శనమే ఈ ప్రాంతాన్ని అంతా రక్షిస్తోందని స్థానికుల విశ్వాసం. ఆ సుదర్శనంను దర్శించి ప్రార్థిస్తే సకలరోగాలు నివారణ అవుతాయి. అనేక ఆపదల నుంచి రక్షణ పొందవచ్చని భక్తుల ప్రగాడ విశ్వాసం.

ఐటీసీ విశ్రాంతి భవనానికి సీఎస్ శాంతికుమారి

- ఘన స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ, పీవో

బూర్గంపాడు, ఏప్రిల్ 16: శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ విశ్రాంతి భవనానికి చేరుకున్నారు. విశ్రాంతి భవనం వద్ద సీఎస్‌కు కలెక్టర్ ప్రియాంక పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎస్ పోలీసుల గౌర వ వందనం స్వీకరించారు. సీఎస్‌కు స్వాగతం పలికిన వారిలో ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఎస్పీ రోహిత్‌రాజ్ ఉన్నారు.



సీఎస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

జిల్లా సరిహద్దు వద్ద సీఎస్‌కు పీవో ఘన స్వాగతం

జూలూరుపాడు: భద్రాచలంలో బుధవారం జరిగే శ్రీసీతారామచంద్ర స్వామి కళ్యాణ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి భద్రాద్రి జిల్లా సరిహద్దు జూలూరుపాడు మండలంలోని వినోబానగర్ గ్రామం వద్ద మంగళవారం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఘనంగా స్వాగతం పలికారు. ఆమెకు మొక్కతో పాటు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

శ్రీరామనవమికి పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లు

- అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాల్లో విధులు నిర్వహించాలి: ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ రామనవమికి పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాల్లో బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. మంగళవారం ఎస్పీ రోహిత్‌రాజు శ్రీ రామనవమి సందర్భంగా మన జిల్లాతోపాటు వివిధ జిల్లాల నుంచి బందోబస్తు విధులకు హాజరయ్యే సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. శ్రీ రామనవమికి హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది వారివారికి కేటాయించిన ప్రదేశాల్లో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. విధుల పట్ల ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండ సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ సమయస్ఫూర్తితో నడుచుకోవాలన్నా రు. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ భక్తులకు అసౌకర్యం కలగకుండ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి. సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయబా బు, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

ఆది దంపతులే ఆదర్శం.. ఆరాధ్యం..

భద్రాచలం, ఏప్రిల్ 16: భార్య భర్తల అన్యోన్యతకు, బంధానికి ప్రతిరూపం సీతారాములే... ఎన్ని తరాలు, యుగాలు దాటినా ఆ జంటే నేటి తరానికి ఆది దంపతులే ఆదర్శం...ఆరాధ్యం.. ఇందుకు కారణం 14 ఏళ్ల అరణ్యవాసంలో ఒకరికొకరు దూరమైనా ప్రేమానురాగాల్లో వారికి సాటెవరు లేరు. నేటికీ భార్య భర్తల బంధమంటే సీతారాముల్లా కలిసుండాలని పెద్దలు సైతం ఆశీర్వదిస్తారు. అంతటి అపురూపమైన ఆ జంట కల్యాణాన్ని ప్రతి ఏటా చైత్ర శుద్ధ నవమి నాడు జరుపుకొని భక్తి శ్రద్ధలు చాటుకుంటారు. ప్రపంచంలోనే మరెక్కడా లేనటువంటి అరుదైన ఈ ఘట్టాన్ని కనులార వీక్షించాలని తలంచిన వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. నాటి నుంచి నేటి వరకు ప్రతి పల్లెలో, ప్రతి గ్రామంలో, పట్టణాలు, నగరాల్లో, విదేశాల్లో సైతం శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం జరుపుకోవడం ఒక సంప్రదాయంగా మారింది. హిందు ధార్మిక వ్యవస్థలో భార్య భర్తల బంధానికి ప్రత్యేక చిహ్నంగా నిలిచే ఈ కల్యాణాన్ని తిలకించి కల్యాణ అక్షింతలు తాము వేసుకుంటే ఈ జన్మలోనే కాదు మరు జన్మలో సైతం తాము సీతారాముల జంటలా ఉండాలని అధిక శాతం మంది భక్తులు భావిస్తారు. అందుకే రామయ్య కల్యాణ తలంబ్రాలకు ఎక్కడా లేని విశిష్టత ఉంది. కల్యాణానికి ముందు తలంబ్రాలను కలిపే సమయంలో సైతం ముత్తైదువులు ఈ తంతులో పాల్గొనడం ఒక ఆనవాయితీగా వస్తోంది.

- సీతారాముల కల్యాణం సాగేదిలా..

కల్యాణం జరిగేది ఇలా..



తొలుత భద్రాద్రి రామాలయంలో మూలవరులకు ప్రత్యేక అలంకరణ నిర్వహించి కల్యాణం ఏకాంతంగా చేస్తారు. అనంతరం మంగళవాయిద్యాలు మోగుతుండగా భక్తుల జయ జయ ధ్వానాల మధ్య పల్లకిలో కల్యాణ మండపానికి స్వామి తరలివస్తారు. ముందుగా తిరుకల్యాణానికి సంకల్పం చేసి ఎటువంటి ఆటంకాలు ఎదురుకాకుండా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేసి, కల్యాణానికి ఉపయోగించే సకల వస్తు సామాగ్రికి సంప్రోక్షణ చేస్తారు. తరువాత రక్షాబంధనం, యోక్త్రబంధనం అనంతరం ఎనిమిది మంది వైష్ణవులకు తాంబూలాది సత్కారాలను చేసి కన్యావరణం చేస్తారు. తరువాత వధూవరుల ఇరు వంశాల గ్రోతాలను పఠించి స్వామి పాద ప్రక్షాళన అనంతరం పరిమళ భరిత తీర్థంతో మంత్రోక్తంగా పుష్పోదక స్నానం చేయిస్తారు. గోదానం చేసి మహాసంకల్పం పఠిస్తారు. ఈ మహాసంకల్పానికి అనుగుణంగా కన్యాదానం జరుగుతుంది. అనంతరం మంగళవాయిద్యాలు మారు మ్రోగుతుండగా వేద మంత్రాల మధ్య అభిజిల్లగ్నం సమీపించగానే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సుపై ఉంచుతారు. ఆ తరువాత మాంగల్య పూజలో మంగళసూత్రాలతో ముగ్గురు అమ్మవార్లను ఆవాహన చేస్తారు. తొమ్మిది పోగులతో మూడు సూత్రాలతో తయారయ్యే మంగళ సూత్రం ఎన్నో వేదాంత రహస్యాలను చాటి చెబుతుంది. తొమ్మిది పోగులు వివిధ సంబంధాలకు ప్రతీకలు. మూడు సూత్రాలు కర్మ, జ్ఞాన, భక్తి మార్గాలకు సంకేతాలు. సూత్రంలో గౌరీదేవిని, సూత్ర మధ్యలో సరస్వతిని, సూత్ర గ్రహంలో మహాలక్ష్మిని ఆవాహన చేస్తారు. ఆ ముగ్గురమ్మలను ఆవాహన చేసిన మంగళ సూత్రాలలో భక్తరామదాసు చేయించిన మంగళ పతకాన్ని కలిపి ధరింపజేయడంతో మంగళసూ త్రధారణ పూర్తవుతుంది. ఆ తర్వాత శ్రీ వైష్ణవ సం ప్రదాయాన్ని ఆచరించి గోదాదేవి శ్రీ రంగనాథునితో కల్యాణం జరిగినట్లు కలగన్న వైవాహిక స్వప్నం వారణమాయిరం అన్న పది తమిళ పద్యాలు పాడుతూ అర్చక స్వాములు బంతులాట ఆడతారు. అనంతరం సీతారాముల శిరస్సుపై తలంబ్రాలను వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ అర్చకస్వాములు పోస్తారు. ఇదే సమయంలో కర్పూర నీరాజనం సమర్పిస్తారు. చతుర్వేదాలతో సీతారాములకు ఆశీర్వచనం ఇవ్వడంతో ఈ కల్యాణ క్రతువు పూర్తవుతుంది.

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనిపై కేసు నమోదు

పాల్వంచ, ఏప్రిల్ 16: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై పాల్వంచ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో మార్చి 23న ఎమ్మెల్యే కూనంనేని పాల్వంచ మండలం తోగ్గూడం, జగన్నాథపురం గ్రామ పంచాయతీల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పాల్వంచ ఎంపీడీవో విజయభాస్కరరెడ్డి పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 8న ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ అదే రోజు కేసు నమోదు చేశారు. కానీ ఎమ్మెల్యేపై కేసు నమోదైన విషయం గోప్యంగా ఉంచారు.

రామయ్య కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి ఈసీ అనుమతి

భద్రాచలం, ఏప్రిల్ 16: భద్రాచలంలో బుధవారం జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి ఎన్నికల సంఘం అనుమతించింది. ఎన్నికల నేపథ్యంలో రాములోరి కల్యాణం ప్రత్యక్ష ప్రసారం చేయకూడదని ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో నాలుగు దశాబ్దాలుగా శ్రీరామనవమి నాడు ప్రసారం చేస్తున్న సీతారాముల కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ఎన్నికల సంఘాన్ని కోరుతూ లేఖ రాసింది. అలాగే రామ భక్తులు సైతం ఎన్నికల సంఘం ఈ విషయంలో సానుకూలంగా స్పందించాలని అభ్యర్థించారు. దీంతో ఎన్నికల సంఘం ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అనుమతి మంజూరు చేసింది.

కేటీపీఎస్ క్రీడాకారులకు జెన్కో సీఎండీ అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న సీఎండీ రిజ్వీ

పాల్వంచ, ఏప్రిల్ 16: పాల్వంచ కేటీపీఎస్ 7వ దశ క్రీడాకారులను జెన్కో సీఎండీ రిజ్వీ అభినందించారు. హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌధాలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఇటీవల హర్యానాలో ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ బోర్డ్స్ టోర్నమెంట్ కురుక్షేత్ర లో కేటీపీఎస్ క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచి విజయం సాధించి ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. వీరందరినీ సీఎండీ రిజ్వీ అభినందించి, భవిష్యత్తులోనూ క్రీడల్లో రాణిస్తూ జెన్కోకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జెన్కో స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, గేమ్స్ సెక్రెటరీ వై. వెంకటేశ్వర్లు, కోచ్ వల్లమల్ల ప్రకాష్, క్రీడాకారులు ఆరీఫ్, సాల్మన్‌రాజ్, పావని, శ్రీవల్లి, పార్వతి, చిన్నారి, మాధవి, నాగలక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు రూట్‌మ్యాప్‌లు సిద్ధం

- సిబ్బంది తరలింపునకు సులువుగా మార్గదర్శకం
- పంపిణీ కేంద్రాలనుంచి ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 16: ఎన్నికల నిర్వహణకు నానా హంగామా ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన అంశం పోలింగ్ రోజున సిబ్బంది, ఇతర వాహనాలు తరలివెళ్లేందుకు మార్గదర్శకంగా రూట్ మ్యాప్‌లే కీలకం. ఈ నేపథ్యంలో త్వరలో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికలకు నియోజకవర్గం పరిధిలో ఏడు నియోజకవర్గాల్లోనూ జిల్లా అధికార యంత్రాంగం రూట్‌మ్యాపులను సిద్ధం చేస్తోంది. నియోజకవర్గాల వారీగా పంపిణీ కేంద్రం నుంచి ఏఏ రూట్ల మీదుగా వెళ్లాలి.. ఎక్కడెక్కడ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయో గుర్తించి ఆ కేంద్రాలకు నేరుగా పోలింగ్ సిబ్బంది, పోలీసులు ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందిని చేరవేసేందుకు రూట్‌లుగా విభజించి పంపిణీ చేయనున్నారు. ఎన్నికల సిబ్బందిని ప్రత్యేక బస్సుల ద్వారా పంపిణీ చేయనున్న నేపథ్యంలో బస్సులు నిర్దేశించిన రూట్ల ద్వారా సిబ్బందిని సామగ్రిని చేరవేయనున్నారు. నేపథ్యంలో ఆ రూట్లు ఎలా ఉండాలి.. ఎన్ని పోలింగ్ కేంద్రాలను కలుపుతూ ఉండాలి.. అనే విషయాలను గూగుల్ మ్యాప్ ద్వారా పోలింగ్ కేం ద్రాలను గుర్తించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా రూట్‌మ్యాపు ల ను సిద్ధం చేస్తున్నారు ఖమ్మం కలెక్టర్ గౌతమ్ ప్రత్యేక దృష్టి సారించి వీటిని ఒకటికి రెండు సార్లు పరిశీలిస్తు సలహా లు, సూచనలు ఇస్తున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని నియోజకవర్గాల్లోనూ అధికారులు వీటిని సిద్ధం చేశారు.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లు

- ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 355 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 135 లొకేషన్ల 36 రూట్లుగా విభజించారు. పాలేరు నియోజకవర్గంలోని చైతన్య కాలేజీ నుంచి పోలింగ్ సామగ్రి, సిబ్బంది పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే పోలింగ్‌రోజున సామగ్రిని తరలించి తర్వాత ఈవీఎంలను ఇక్కడికి చేరుస్తా రు. ఆ తర్వాత ఇక్కడే కౌంటింగ్ నిర్వహించనున్నారు.
- వైరా నియోజకవర్గంలో మొత్తం 252 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 180 లొకేషన్ల 23 రూట్లుగా విభజించారు. వైరా సాంఘిక సంక్షేమ రెసిడెన్సియ ల్ పాఠశాలలో పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.



వైరా నియోజకవర్గం మ్యాప్

- పాలేరు నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలు ఉండగా 193 లొకేషన్లు 29 రూట్లుగా విభజించారు. రూట్ మ్యాపులు సిద్ధం చేశారు. తల్లంపాడు సమీపంలో చైతన్య కళాశాలలో పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.
- సత్తుపల్లి నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలకు 164 లొకేషన్లు 28 రూట్లుగా విభజించారు. ఇక్కడ కూడా అన్ని పోలింగ్ కేంద్రాల గుర్తింపు మ్యాపింగ్ పూర్తిచేశారు. ఇక్కడ జ్యోతి నిలయం హైస్కూల్‌లో పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.
- మధిర నియోజకవర్గంలోనూ 2681 పోలింగ్ కేంద్రాల కు గాను 152 లొకేషన్లు 25 రూట్లుగా విభజించారు. ఇక్కడ ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలో పోలింగ్ సామాగ్రిని, సిబ్బందిని పంపిణీ చేయనున్నారు.
- కొత్తగూడెంలో 253 పోలింగ్ కేంద్రాలు ఉండగా 139 లొకేషన్లు 30 రూట్లుగా విభజించారు.. ఇక్కడ రామచంద్రా డిగ్రీకళాశాలలో సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేస్తారు. ఎన్నికల తర్వాత ఈవీఎంలను నేరుగా పాలేరు నియోజకవర్గం తల్లంపాడు చైతన్య ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూంకి తరలిస్తారు.
- అశ్వారావుపేటలో 184 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అక్కడ 124 లొకేషన్లు లో 32 రూట్లుగా విభజించారు. ఇక్కడ అగ్రికల్చర్ కళాశాలలో సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

నామినేషన్ల ప్రక్రియను
సమర్థవంతంగా నిర్వహించాలి

- అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- కలెక్టర్ గౌతమ్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్ 16: నామినేషన్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం రిటర్నింగ్ అధికారి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నామినేషన్ స్వీకరణ ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో పరిశీలించాల్సిన పత్రాలు, అభ్యర్థులకు అందించాల్సిన సూచనలు, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు తదితర అంశాలను అధికారులకు వివరించారు.

అభ్యర్థులకు సూచనలు..

లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలుకు ముందురోజు ప్రత్యేకమైన బ్యాంకు ఖాతా ప్రారంభించాలని, స్క్రూటిని ప్రారంభం కంటే ముందే అఫిడవిట్ కరెక్షన్స్, డిపాజిట్ సొమ్ము, కుల ధ్రువీక రణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. స్క్రూటినీ కంటే ఒకరోజు ముందే అభ్యర్థి ప్రతిజ్ఞ తీసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఎన్నికల లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ ఫారం 2ఏ, అఫిడవిట్ ఫారం 26 ద్వారా సమర్పించాలన్నారు. అభ్యర్థుల ప్రతిపాదకులు తప్పనిసరిగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఓటర్లుగా ఉండాలని, అభ్యర్థి వయసు, కులం వివరాలు నామినేషన్ పేపర్ పై నమోదు చేయాలని, రాజకీయ పార్టీల తరపున నమోదు చేసే అభ్యర్థులు వారి డిక్లరేషన్ ఫారం సమర్పించాలన్నారు. అభ్యర్థి అఫిడవిట్ ఫారం 26లో పార్టీ పేరు, పార్లమెంటరీ నియోజకవర్గం పేరు, రాష్ట్రం పేరు, ఓటరు జాబితాలో పార్ట్, క్రమ సంఖ్య వివరాలు, పెండింగ్ క్రిమినల్ కేసులు వివరాలు, ఆస్తులు వివరాలు, అప్పుల వివరాలు, వృత్తి, విద్యార్హతలు, మొదలగు అన్ని వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని అన్నారు. అభ్యర్థి దాఖలు చేసిన అఫిడవిట్లో ప్రతిపేజీపై అభ్యర్థి సంతకం చేయాలని, అఫిడవిట్ నోటరీ చేయాలని లేదా కమిషనర్/ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాలని, అభ్యర్థి ఫోటో సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ తీసుకోవాలని అన్నారు. నామినేషన్ తీసుకున్న తర్వాత రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి అఫిడవిట్ లో అన్ని కాలాలు నింపి ఉన్నాయా, ధృవీకరించిన ఓటరు జాబితా కాపీ (అభ్యర్థి ఇతర నియోజకవర్గ ఓటర్ అయితే), ఫారం ఏ, ఫారం బీ, కుల ధ్రువీకరణ పత్రం, డిపాజిట్, ప్రతిజ్ఞ అంశాలను పరిశీలించి చెక్ లిస్ట్ జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లుతెలిపారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా నామినేషన్ ప్రక్రియ సజావుగా జరగాలని ఆదేశించారు. నామినేషన్ ప్రక్రియలో పని చేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశాన్ని శ్రద్ధతో పరిశీలించాలన్నారు. బందోబస్తు విషయంలో అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, అదనపు డిసిపి ప్రసాద రావు, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, జిల్లా ఉపాధికల్పన అధికారి కె. శ్రీరామ్, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, రాంబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్, సీపీ

ఆణిముత్యములు..
తలంబ్రాలుగా..

(5వ పేజీ తరువాయి)

చేసినట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారు. మిథిలాస్టేడియంలోని 24సెక్టార్లలో 31,860 మంది ప్రత్యక్షంగా స్వామివారి కల్యాణం తిలకించేందుకు అవకాశం ఉంది. ఇందులో గ్యాలరీ ద్వారా 15 వేల మంది ఉచితంగా కల్యాణం తిలకించేందుకు అవకాశం ఉంది. భక్తుల సౌకర్యార్థం స్టేడియంలోని ప్రతిసెక్టార్‌లో ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 100 కూలర్లు, 50 టన్నుల ఏసీలను, 270 ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. గురువారం శ్రీరామమహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

నిఘా నీడలో భద్రగిరి

శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా భద్రాచలంలో పోలీసుశాఖ కనీవిని ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేసింది. వరంగల్ రేంజి ఐజీ రంగనాథ్ నేతృత్వంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షణలో భద్రాచలం ఏఎస్‌పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో 1,800 మందికి పైగా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ బందోబస్తులో అడిషనల్ ఎస్పీలు ఇద్దరు, 13 మంది డీఎస్పీలు, 55 మంది సీఐలు, 155 ఎస్సైలు, 800 మంది ఏఎస్సై/హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, 150 మహిళా కానిస్టేబుళ్లు, 330 హోంగార్డులతోపాటు స్పెషల్ పార్టీలు, ఆర్మ్‌డ్ రిజర్వు సెక్షన్లు, సీఆర్పీఎఫ్ సెక్షన్లు, బాం బ్ డిస్పోజబుల్ బృందాలు బందోబస్తులో పాల్గొంటున్నాయి.

రేపు మహాపట్టాభిషేకానికి గవర్నర్

భద్రాచలం, ఏప్రిల్ 16: భద్రాచలంలో గురువారం నిర్వహించే శ్రీరామ మహాపట్టాభిషేకానికి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హాజరు కానున్నారు. ఆయన గురువారం ఉదయం 7.55కి హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి 9.15కి భద్రాచలం చేరుకుంటారు. అనంతరం ఐటీసీ సారపాక అతిథిగృహంలో అల్పాహారం తీసుకొని 9.45కు బయలుదేరి 10.00 గంటల వరకు రామాలయంలో శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శనం దర్శించుకుంటారు. అనంతరం 10 గంటల నుంచి 12.30వరకు మిథిలా స్టేడియంలో నిర్వహించే శ్రీరామ మహాపట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొంటారు. తరువాత 12.40కి ఐటీసీ విశ్రాంతి గృహానికి చేరుకొని భోజనం చేసి అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరతారు.

35రకాల పూలు...

రామయ్య కల్యాణం, శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని పురస్కరించుకొని దేవస్థానం సుమారు రూ.7లక్షలతో కల్యాణ మండపాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఇందులో యాసిటెక్ లిల్లీ, యాంగిగ్ ఎలిపోనియా, ఆర్కిడి కార్నేషన్, ఆంతోనియం, టైగర్ ఆర్కిడ్, వాలుజడ, ఒరియంట్ లిలీ, చామంతులు, గులాబీలు, మల్లెలు, బంతిపూలు తదితర పుష్పాలతో మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

కల్యాణం నిర్వహించే వైదిక బృందం ఇదే

భద్రాద్రి రామయ్య కల్యాణాన్ని దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. అధ్వర్యులుగా ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఆచార్యులుగా కోటి శ్రీమన్నారాయణాచార్యులు, బ్రహ్మగా అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, రుత్వికులుగా అమరవాది మురళీకృష్ణమాచార్యులు, అర్చకులు పొడిచేటి సీతారామాచార్యులు, అలంకార రుత్వికులుగా కోటి రామస్వరూప్ రాఘవాచార్య, కోటి విష్ణువర్ధనాచార్యులు, పరిచారక రుత్వికులుగా తిరుమల రాఘవచార్యులు వ్యవహరించనున్నారు. వీరితో పాటు వేద పండితులు, ఇతర వైదిక బృందం సహకారం అందించనున్నారు.

ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న సీఎస్ శాంతికుమారి

సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ. శాంతికుమారి సమర్పించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆమె భద్రాచలం చేరుకున్నారు. అనంతరం ఐటీడీఏ పీవో ఛాంబర్‌లో జిల్లా అధికార యంత్రాంగంతో నవమి ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆమెతో పాటు రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ తదితరులు ఉన్నారు. అనంతరం నవమికి చేపట్టిన ఏర్పాట్లను సీఎస్ పరిశీలించారు.


రామాలయంలో పూజల్లో పాల్గొన్న హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి


సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ


ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న సీఎస్ శాంతికుమారి దంపతులు


హాజరైన భక్తులు

కలిసికట్టుగా 'గులాబీ' జెండా ఎగురవేద్దాం...

● బీఆర్ఎస్ నేతలు నామా, వద్దిరాజు, పువ్వాడ

ఖమ్మం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో నేతలమంతా కలిసి కట్టుగా ప్రచారం సాగిస్తామని, ఖమ్మంలో గులాబీ జెండా ఎగురవేద్దామని బీఆర్ఎస్ లోక్‌సభ నేత నామా నాగేశ్వరరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు కార్యకర్తలు అధైర్యపడొద్దని, తాము అండగా ఉంటామని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

నగరంలోని మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో మంగళవారం బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా, ఎంపీ వద్దిరాజు తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా కార్యకర్తలనుద్దేశించి నామా నాగేశ్వరరావు ప్రసంగిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు.

మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రసంగిస్తూ కార్యకర్తల బలమే బీఆర్ఎస్ బలగం అని పేర్కొన్నారు.

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేసులకు భయపడే దిలేదని, కాంగ్రెస్ బీజేపీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. ఖమ్మంలో నామాను మంచి మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల పక్షాన, ఖమ్మం జిల్లా ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా నామను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, తాళ్లూరి జీవన్, మోతారపు సుధాకర్, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరునాయక్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, వలరాజు, రుద్రగాని శ్రీదేవి, జ్యోతిరెడ్డి తదితరులున్నారు.

కార్యకర్తలను కన్నబిడ్డల్లా కాపాడుకుంటాం

ఖమ్మంకార్పొరేషన్: కార్యకర్తలను బీఆర్ఎస్ ఎల్లప్పుడూ కన్నబిడ్డల్లా కాపాడుతుందని, కేసులు పెట్టి జైళ్లల్లో ఉంచినా, ఎవరూ అధైర్యపడవద్దని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. కామేపల్లి మండలం పండితాపురంలో ఇటీవల జరిగిన ఘర్షణలో కేసులు నమోదై జిల్లా జైలులో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు ధనేకుల హన్మంతరావు, మాధవరావు, చల్లా హరి, నాగేంద్రబాబు, నరేష్‌లను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి నామా మంగళవారం ములాఖత్‌లో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బాణోత్ హరిప్రియ, కృష్ణారెడ్డి, తీర్థాల చిదంబరం, కృష్ణప్రసాద్ ఉన్నారు.


బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ నామా

ఉద్యాన రైతుల ఆదాయం పెంచేలా ప్రణాళికలు

» ఆయిల్‌ఫెడ్ ఎండీ, ఉద్యానశాఖ డైరక్టర్ అశోక్‌రెడ్డి

అశ్వారావుపేట, ఏప్రిల్ 16: ఉద్యాన రైతుల ఆదాయాన్ని మూడింతలు పెంచే లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నట్టు ఆయిల్‌ఫెడ్ ఎండీ, ఉద్యానశాఖ డైరక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించి నిర్మాణ వివరాలను తెలుసుకున్నారు. గంగారం, నారంవారిగూడెంలోని పామాయిల్ క్షేత్రాన్ని పరిశీలించి, తోటల యాజమాన్యం, అంతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ మాట్లాడుతూ ఉద్యానశాఖలో ఖాళీగా ఉన్న 19 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, పీఅండ్‌పీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల ఉద్యానశాఖాధికారులు సూర్యనారాయణ, రమణలు, ఆయిల్‌ఫెడ్ మేనేజర్‌లు భారతి, డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తదితరులున్నారు.


పామాయిల్ ఫ్యాక్టరీలో గెలలను పరిశీలిస్తున్న ఆయిల్‌ఫెడ్ ఎండీ అశోక్‌రెడ్డి

ఖమ్మం న్యాయవాద సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 16: మంగళవారం ఖమ్మం బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాద సంక్షేమ సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. నాలుగు డైరెక్టర్ పదవులకు ఆరుగురు పోటీ పడగా మొత్తం ఓట్లు 472కి 380 ఓట్లు పోలు అయ్యాయి. వాటిని ప్రిఫెరెన్సియల్ ఓటింగ్ ద్వారా నలుగురు అభ్యర్థులను ఎన్నిక అయినట్లుగా ప్రకటించారు. పలివెల శ్రీ లక్ష్మి, అనుముల నరసింహారావు, భూక్యా రమేష్, దేవకీ శ్రీనివాసరావు గుప్తా ఎన్నిక అయినట్లుగా ఎన్నికల అధికారి ప్రకటించారు. తరువాత సొసైటీ డైరెక్టర్లు అందరి కలసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా కాసర రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా నోముల వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీగా పిడతల రామ్మూర్తి, కోశాధికారిగా యాసా క్రాంతికుమారిలను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి గుడ్డేటి రమేష్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి కొప్పుల రవికుమాలు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావుతో పాటు సీనియర్ జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

నాటి కలెక్టర్ ఉషారాణి ప్రేరణతోనే..

● సివిల్స్ ర్యాంకర్ రావూరి సాయి అలేఖ్య

బోనకల్, ఏప్రిల్ 17: ఖమ్మంలో తాను 7వ తరగతి చదువుతున్నపుడు నాన్నతో పాటు రిపబ్లిక్ డే ఉత్సవాలకు వెళ్లానని, అక్కడ నాటి కలెక్టర్ ఉషారాణి ఇచ్చిన సందేశంతో సివిల్స్ సాధించాలనే లక్ష్యం పెట్టుకున్నానని సాయి అలేఖ్య తెలిపారు. ర్యాంక్ సాధించిన సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆమెను పలకరించగా పలు విషయాలను పంచుకున్నారు.

'మాది మధ్య తరగతి కుటుంబ నేపథ్యం.. తాతయ్య వెంకట్రామయ్య సాయుధ తెలంగాణ పోరాట యోధుడు. అభ్యుదయ భావజాలంతో కుటుంబంలో అందరినీ చదివించారు. నాన్న హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. అమ్మ గృహిణి. ప్రతి ఏడాది తాతయ్య వర్ధంతి సందర్భంగా పేదలకు మా వంతుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటాం.' అని అలేఖ్య చెప్పారు. 'వాస్తవానికి సివిల్స్ లక్ష్య సాధన కష్టంతో కూడిన అంశమే. కానీ పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చు. నాలుగు సార్లు ఫలితాలు రాకపోయినా నిరుత్సాహానికి గురి కాలేదు. ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఉంటే విజయానికి దగ్గరైనట్లేనని భావించాను. ఐదో సారి మాత్రం రెట్టింపు ఉత్సాహంతో ర్యాంకు సాధించాను..' అని అలేఖ్య చెప్పారు.

'విజయ సాధనలో నాకు నా తల్లిదండ్రులతో పాటు అప్త మిత్రురాలు సుస్మిత, గురువులు బాలలత, విష్ణు మార్గదర్శకులుగా తోడ్పాటును అందించారు. టాపర్ల విజయాలను పరిశీలిస్తూ లోపాలను సరిదిద్దుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లో ఆత్మన్యూనత భావానికి లోను కాకుడదు..' అని అలేఖ్య స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

● నల్గొండ కలెక్టర్ హరిచందన

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 16: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని నల్గొండ జిల్లా కలెక్టర్ హరిచందన సూచించారు. పూర్వ నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎన్నికల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాల్గొన్న ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 115 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 83,600 పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు, వీరిలో 50,513 మంది పురుషులు, 33,083 మంది మహిళలు, 4గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 16: జిల్లా క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి మే 20 వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల బాలురు, బాలికలకు ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. జగన్‌మోహన్‌రావు, జిల్లా క్రికెట్ సంఘం బాధ్యులు చేకూరి వెంకట్, మసూద్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా క్రీడాకారులకు నగరంలోని పెవీలియన్ గ్రౌండ్ క్రికెట్ నెట్స్‌లో, భద్రాద్రి జిల్లా క్రీడాకారులకు గౌతంపూర్ క్రికెట్ గ్రౌండ్స్ నందు శిక్షణా శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా క్రికెట్ సంఘం మేనేజర్ పారూఖ్ 98486 62125 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

21న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 16: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్-14, 16, 18, 20 బాలురు, బాలికల, సీనియర్ పురుషులు, మహిళల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి త్వరలో సూర్యాపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 8 గంటల కల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

'విద్యాసంస్థలు నమోదు చేసుకోవాలి'

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్16: ఈఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతిభావంతులైన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ ఇంటర్‌మీడియట్ విద్య, ఎంసెట్ శిక్షణను ప్రభుత్వం ద్వారా ఇచ్చేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన జూనియర్ కళాశాలలు, విద్యాసంస్థలు ఈనెల 18నుంచి 27వరకు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఉపసంచాలకులు కస్తాల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలమైన భవనాలు, మౌలిక సదుపాయాలు, తరగతులు నిర్వహించేందుకు ఇండోర్, అవుట్‌డోర్ సౌకర్యాలు గడిచిన మూడేళ్లలో కళాశాల ఉత్తీర్ణతాశాతం, ప్రయోగశాలలు, ఫ్యాకల్టీలు కలిగి ఉన్న విద్యాసంస్థలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఖమ్మం జిల్లాకు మరో ట్రైనీ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 16: ఖమ్మం జిల్లాకు మరో శిక్షణ కలెక్టర్ వచ్చారు. తెలంగాణ క్యాడర్‌కి కేటాయించిన ఐఏఎస్. మ్రినా ల్ శ్రేష్ఠ శిక్షణా సహాయ కలెక్టర్‌గా ఖమ్మం జిల్లాలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2023 బ్యాచ్‌కు చెందిన మ్రినాల్ శ్రేష్ఠ బీహార్ రాష్ట్రానికి చెందినవారు. తొలుత ఆయన జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటికే జిల్లాలో మయాంక్ సింగ్, యువరాజ్ శిక్షణ కలెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు.

అగ్నిప్రమాదంలో సుబాబుల్ పంట దగ్ధం

» రూ.మూడు లక్షల ఆస్తి నష్టం

మధిరరూరల్, ఏప్రిల్ 16: మధిర మండలం తొండలగోపారం గ్రామసమీప పొలాల్లో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో పలువురు రైతులకు చెందిన 13ఎకరాల్లోని సుబాబుల్ పంట దగ్ధమైంది. దీంతో ఆరైతులకు రూ.మూడులక్షల నష్టం వాటిల్లింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామశివారులోని స్మశాన వాటిక డొంక రోడ్డులో పలువురు రైతులకు చెందిన సుబాబుల్ పొలాలు ఉన్నాయి. ప్రమాదవశాత్తూ తేళ్ల నాగేశ్వరరావుకు చెందిన సుబాబుల్ పొలంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ రైతుకు చెందిన నాలుగు ఎకరాలతోపాటు, నలమల బాబూరావు, నారాయణ ప్రసాద్, నలమల సత్యనారాయణ, భద్రరావు, శంకర్రావు అనే రైతులకు చెందిన పొలాలకు కూడా ఈ మంటలు వ్యాపించాయి. సుమారు 13ఎకరాల్లో సుబాబుల్ పంట దగ్ధమైంది. ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. ప్రమాదం ఎలా చోటుచేసుకుందనేది తెలియడం లేదని స్థానిక రైతులు తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కల్లూరులో అరటి పండ్ల దుకాణం..

● రూ. 2 లక్షలకు పైగా ఆస్తి నష్టం

కల్లూరు, ఏప్రిల్ 16: విద్యుదాఘాతంతో అరటిపండ్ల దుకాణంతో పాటు కొలిమి షాపు మరో బడ్డీ కొట్టు వరుసగా దగ్ధమైన సంఘటన కల్లూరు పట్టణంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని ప్రధాన రహదారిలో ప్రమాదవశాత్తు ఎస్‌కే నసీర్‌పాషా కు చెందిన అరటి పండ్ల దుకాణం, కంద్రాతి నెహ్రూకు సంబంధించిన కొలిమి షాపులు దగ్ధమయ్యాయి. రూ.2.40లక్షల ఆస్తి నష్టం కలిగినట్లు బాధితులు తెలిపారు. ఫైరింజన్ సిబ్బంది మంటలను ఆర్పారు. ఆర్ఐలు అన్వర్, స్టాలిన్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకుడు దయానంద్, పసుమర్తి చందర్‌రావులు అగ్నిప్రమాద సంఘటన ప్రదేశానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగితెలుసుకున్నారు.

ఘనంగా వేంకటేశుడికి పుష్పయాగం

ఎర్రుపాలెం ఏప్రిల్ 16: జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు మంగళవారం శ్రీవారికి పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ శ్రీవారికి పుష్పాలతో, బంగారు ఆభరణాలతో అలంకరణ పరిపాటి అని, పుష్ప కైంకర్యం ప్రత్యేకమని అన్నా రు. 11రకాల అపురూప పుష్పాలు, వివిధ రకాల పత్రాలతో, మంత్రోచ్చరణ మధ్య పుష్పయాగం నిర్వహించామన్నారు. సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలంటే అత్యంత ప్రీతని, రంగు రంగుల పుష్పాలతో కనివిందుచేస్తూ పరిమళాలతో నిర్వహించే పుష్పయాగం నిర్వహించడం వలన లోక కల్యాణం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాలలో పురాణ ప్రబంధ ప్రవరలు, వేద పారాయణం, కళ్యాణ క్రతువు, వివిధ రకాల హోమాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రమంలో తెలిసి తెలియక చేసే దోషాలు ఈ పుష్పయాగం వలన తొలిగిపోతాయన్నారు. ఈ యాగానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యాగానికి వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలను, అన్నప్రసాద వితరణ చేశారు. సాయంకాలం వేళ మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య శ్రీవారిని గరుడ వాహనంపై గిరిప్రదక్షణ గావించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరిండెంట్ కె.విజయకుమారి, ఉప ప్రధాన అర్చకుడు విజయదేవ శర్మ, అర్చకులు రాజీవ్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.


పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

వైరాలో బీఆర్ఎస్‌కు షాక్

● రాజీనామా యోచనలో మాజీ ఎమ్మెల్యే రాములునాయక్

వైరా, ఏప్రిల్ 16: పార్లమెంటరీ ఎన్నికల ముంగిట వైరా నియోజకవర్గంలోని ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగలనుంది. తాజా, మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ఆ పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధపడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచిన తనకు గత ఎన్నికల్లో టికెట్ ఇవ్వకుండా అవమానించిన బీఆర్ఎస్ నాయకత్వం.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల సమయంలో కూడా ఆశించిన రీతిలో గుర్తింపు ఇవ్వడం లేదని ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది.

ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తన గెలుపు కోసం ప్రచారం చేయాలని కోరినప్పటికీ రాములునాయక్ సుముఖత వ్యక్తం చేయలేదని ప్రచారం జరుగుతోంది. 2018లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన బానోతు మదన్‌లాల్... స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన తన చేతిలో ఓడిపోయినప్పటికీ గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకే పార్టీ టికెట్ ఇచ్చి తనను అవమానించిందని రాములునాయక్ గుర్రుగా ఉన్నారు.

ఐఆర్ఎస్ అధికారిగా ఉన్న తన కుమారుడు జీవన్‌లాల్ ఇంకా అనేక సంవత్సరాలపాటు ఉన్నతాధికారిగా సేవలందించే అవకాశమున్నప్పటికీ రాజకీయాలపై ఆసక్తితో ఎంపీ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి పోటీచేసేందుకు సిద్ధమైనా బీఆర్ఎస్ నాయకత్వం పరిగణలోకి తీసుకోలేదని ఆయన గుర్రుగా ఉన్నారు. రెండురోజులుగా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పర్యటిస్తూ తన అనుచరులతో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసే విషయమై చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకట్రెండురోజుల్లో బీఆర్ఎస్‌కు రాజీనామా చేయటానికి ఆయన సిద్ధమవుతున్నట్లు సమాచారం.

పురుగుల మందు తాగిన దంపతులు

● భార్య మృతి, భర్తపరిస్థితి విషమం ● కల్లూరులో విషాదం

కల్లూరు, ఏప్రిల్ 16: కల్లూరు పట్టణంలోని పుల్లయ్యబంజరు వీధివైపున మంగళవారం ఓ దంపతులు ఆత్మహత్యకు పాల్పడగా భార్య పరిస్థితి విషమించి మృతి చెందగా భర్త పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనకు సం బంధించి వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా పుల్లయ్యబంజరు వీధి వైపున గల చల్లా నరిసింహారావు(45) చల్లా పుష్పలు(40) తమ గృహంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా పరిస్థితి విషమించి భార్య పుష్ప మృతి చెందినది.

భర్త నరిసింహారావు పరిస్థితి విషమంగా ఉండటంతో పరిస ర ప్రాంతాల వారు స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. సదరు ఆసుపత్రిలో నరిసింహారావుకు వైద్య చికిత్స అందిస్తున్నారు.

కాగా శ్రీ వేణుగోపాల ఆలయ వీధి వైపున గల అంజనేయ రైస్ ఇండస్ట్రీ ఎలో పార్టనర్‌గా వ్యవహరిస్తున్నాడు. నరిసింహారావుకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె పావని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా, చిన్నకుమార్తె కావ్య బిటెక్ పూర్తి చేసినట్లు తెలిసింది.

సాయంత్రం సమయంలో హైదరాబాద్‌నుంచి కుమార్తెలు తల్లిదండ్రులకు ఫోన్‌కాల్ చేయగా వారు లిఫ్ట్ చేయకపోవడంతో కల్లూరులో ఉన్న వారి బంధువులకు సమాచారం అందించడంతో వారు నరిసింహారావు ఇంట్లోకి వచ్చి పరిశీలించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సదరు దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన కారణాలు తెలియలేదు. కాగా నరిసింహారావు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారని తెలిసింది.

ద్విచక్రవాహనం, ఆటో ఢీ: వ్యక్తి మృతి

జూలూరుపాడు,ఏప్రిల్16: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రేగళ్లతండా గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతాళపాడు పంచాయతీ గొల్లగూడెం గ్రామానికి చెందిన కిలారు నరసింహరావు(45) తన పొలంలోని మిర్చిని కోయించేందుకు కూలీల కోసం ద్వి చక్ర వాహనంపై బేతాళపాడు నుంచి పడమటనర్సాపురం వెళ్తున్నాడు. ఈ క్రమంలో పడమటనర్సాపురం నుంచి బేతాళపాడు వైపు వస్తున్న ఆటో రేగళ్లతండా గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు అతడిని కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బోయినపల్లి తిరపతిరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వెంగన్నపాలెం ఎంపీటీసీకి గాయాలు

మండలంలోని గుండెపుడి గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావుకు గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా మంగళవారం తెల్లవారుజామున వాకింగ్‌కు గుండెపుడి వైపు వెళ్లి తిరిగి ఇంటికి వెంగన్నపాలెం వస్తుండగా ఈ క్రమంలో జూలూరుపాడు నుంచి చంద్రుగొండ వైపు వెళ్తున్న ఆటో అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఎంపీటీసీని ఫోన్ ద్వారా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పరామర్శించారు. ప్రమాద వివరాలను, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి ...

బూర్గంపాడు, ఏప్రిల్ 16: నిర్మాణంలో ఉన్న డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సారపాకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పంచాయతీలో గల గాంధీనగర్‌కు చెందిన కొంగా భాస్కర్‌రావు(53) ఐటీసీలో క్యాజువల్ లేబర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తన ఇంటి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీని దాటే క్రమంలో ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు అతడిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ...

చుంచుపల్లి, ఏప్రిల్ 16: వడదెబ్బతో భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం పెనుబల్లి పంచాయతీలో ఉపాధి కూలీ మృతి చెందింది. పెనుబల్లి పంచాయతీకి చెందిన బురుగు వెంకటమ్మ(55) గత కొద్ది రోజులుగా ఉపాధి పనులకు వెళుతోంది. ఈ క్రమంలో ఎండదెబ్బతో అస్వస్థతకు గురై మంగళవారం మృతి చెందింది. పని ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే వడదెబ్బతో వెంకటమ్మ మృతి చెందినట్లు తోటి కూలీలు ఆరోపిస్తున్నారు. మృతిరాలి కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఆపడం లేదంటూ...

» డ్రైవర్, కండక్టర్లపై కల్యాణపురం గ్రామస్థుల దాడి

అశ్వాపురం, ఏప్రిల్ 16: తమ గ్రామంలో ఏబస్సు ఆపడం లేదంటూ మండల పరిధిలోని కల్యాణపురం గ్రామస్థులు మణుగూరు ఆర్టీసీ బస్సు అద్దం పగుల గొట్టారు. బస్సును నిలిపి ఆందోళనకు దిగి డ్రైవర్, కండక్టర్లపైకి దాడికి పాల్పడ్డారు. కొద్దిరోజులుగా మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఉన్న కల్యాణపురం గ్రామంలో మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ప్రయాణికులు ఆపినా బస్సులు ఆపకుండా వెళ్తున్నారు. దీంతో విసిగిపోయిన గ్రామస్థులు మంగళవారం మణుగూరు నుంచి ఖమ్మం వెళ్తున్న బస్సు రావడంతో దానిపై రాళ్లు రువ్వడంతో బస్సు అద్దం పగిలింది. అనంతరం డ్రైవర్, కండక్టర్లపై దాడికి పాల్పడడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయమైనట్లు సమాచారం.

సింగరేణి ప్రధాన కార్యాలయంలో

ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 16: సింగరేణి ప్రధాన కార్యాలయంలో 'కానరాని సమయ పాలన' అనే శీర్షికతో ఈ నెల 12న ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన సింగరేణి యాజమాన్యం ప్రధాన కార్యాలయంలో ఫేస్ రిజగ్నేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని ప్రవేశపెట్టింది. సింగరేణి ఉద్యోగులు అధికారులు ఉదయం విధులకు హాజరైన వెంటనే ప్రధాన కార్యాలయం వద్ద ఫేస్ రిజగ్నేషన్ సిస్టంతో హాజరువేసుకునే విధానానికి శ్రీకారం చుట్టింది. దీంతో మంగళవారం ఉదయం విధుల సమయానికి ఉద్యోగులు, అధికారులు సకాలంలో హాజరుకావడం జరిగింది. గతంలో విధుల్లో సమయపాలన పాటించకుండా అధికారులు, ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తోన్నాయి. కరోనాకు ముందే సింగరేణి ప్రధాన కార్యాలయంలో బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నప్పటికీ కరోనా కారణంగా ఆ విధానాన్ని తొలగించారు. దీంతో కొంతకాలంగా ఎలాంటి బయోమెట్రిక్ లేకపోవడంతో విధుల పట్ల కొంతమంది అలసత్వంగా వ్యవహరిస్తున్నారనే విమర్శల నేపథ్యం, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై స్పందించిన సింగరేణి యాజమాన్యం రెండురోజుల క్రితం ప్రధాన కార్యాలయంలో ఫేస్ రిజగ్నేషన్ సిస్టంను ప్రవేశపెట్టడం గమనార్హం.



సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫేస్ రిజగ్నేషన్ సిస్టం

మా కుమారుడి మృతిపై అనుమానాలు

» విచారణ చేయకుండా కాలయాపన చేస్తున్నారని పోలీసులపై ఆరోపణ

» సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

పాల్వంచ, ఏప్రిల్16: పాల్వంచ మండలం పాత సూరారం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి జక్కుల సంపత్ కుమార్(15) గత నెల 24న ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతి చెందిన విషయంపై విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్థులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తామంతా మొదట మా కుమారుడి మృతిని ప్రమాదంగా భావించామని, కానీ తరువాత జరిగిన పరిణామాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయని తల్లి నాగలక్ష్మి, తండ్రి శేఖర్‌లు ఆరోపించారు. ముగ్గురు స్నేహితులతో కలిసి వెళ్లిన తమ కుమారుడు ఈతకు వెళ్లడానికి, మృతి చెందిన సమాయానికి మధ్య కేవలం 30 నిమిషాలు ఉండటంపై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. తమ కుమారుడి మెడ, చెవి భాగాలు కమిలిపోయి ఉండటం, ముగ్గురు స్నేహితులు పొంతనలేకుండా వివరణలు ఇవ్వడంపై ఎన్నో సందేహాలు ఉన్నాయన్నారు. వీటికి తోడుగా తాము ఇరవై రోజుల నుంచి ఈ ఘటనపై విచారణ చేయాలని పోలీసులను వేడుకుంటున్నా కాలయాపన చేయడంతో తమ అనుమానాలు మరింతగా బలపడుతున్నాయన్నారు. తమ కుమారుడి స్నేహితులు సాయికుమార్, నందీశ్వర్‌రెడ్డి, వేణులు హత్య చేశారని అనుమానంగా ఉందని అన్నారు. తమ కుమారుడు సంపత్‌కుమార్ మృతదేహానికి రీ-పోస్టుమార్టం నిర్వహించాలని, ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఐ వినయ్‌కుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.


సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్ కుటుంబ సభ్యులు, బంధువులు

కురవి వీరభద్రస్వామి ఆలయంలో తుమ్మల పూజలు



ఖమ్మంకార్పొరేషన్,ఏప్రిల్16:మహబూబాబాద్ జిల్లా కురవి వీరభద్రస్వామిని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం సాయంత్రం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థ, ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల వెంట డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, తుపాకుల ఎలగొండస్వామి, విక్రమ్‌రెడ్డి తదితరులున్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

- గ్రామగ్రామాన వేడుకలకు ఏర్పాట్లు
- ముత్తారంలో సాయంత్రం పెళ్లి వేడుకలు

ఖమ్మంసాంస్కృతికం, ఏప్రిల్16: సీతారాముల కళ్యాణం సందర్భంగా వాడవాడ పెళ్లి వేదికగా మారింది. ప్రతీ ఊరూ వివాహ సందడి సంతరించుకుంది. మామిడి తోరణాలు, మంగళవాద్యాలు, షామియానాలు, డెకరేషన్లు, టెంట్లు, చలువ పందిళ్లు, ఎక్కడ చూసినా పెళ్లి హడావుడి దృశ్యాలు నెలకొన్నాయి. ఖమ్మం నగరంలోని అన్ని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవాలయాలతోపాటు అన్ని డివిజన్లలో పెళ్లి వేడుకలను సిద్ధం చేశారు. సీతారాములకు కళ్యాణ తంతు నిర్వహించేందుకు వీలుగా సీతారాముల సహిత ఆంజ నేయ విగ్రహాల విక్రయాలు ఖమ్మం నగరంలో జోరుగా సాగుతున్నాయి. రాజస్థాన్ తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులు, శ్రీరామ నవమి సందర్భంగా ఉపయోగించే సీతారామ విగ్రహాలను దిగుమతి చేసి విక్రయిస్తున్నారు.

సాయం సంధ్యవేళ రాములోరి కల్యాణం

ముదిగొండ: దేశవ్యాప్తంగా శ్రీసీతారాముల కల్యాణం పగటివేళలో నిర్వహిస్తారు. కానీ ఖమ్మంజిల్లా ముదిగొండ



ముత్తారంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం

మండలం ముత్తారంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో మాత్రమే శ్రీరాముని కల్యాణం రాత్రి సాయం సంధ్యవేళలో నిర్వహించటం విశేషం. రెండో భద్రాద్రిగా ముత్తారం రామాలయం పేరొందింది. ఈ ఆలయం ఎంతో విశిష్టతను కలిగి ముత్తారం గ్రామానికి చెందిన వనం కృష్ణదేవరాయులు అనే భక్తుడు ఆలయ నిర్మాణం చేపట్టారు. భద్రాచలంలో ఉదయం కల్యాణం అనంతరం తలంబ్రాలను ప్రతి ఏటా తీసుకువచ్చి సాయం సంధ్యవేళ ముత్తారంలో సీతారాముల కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఈనెల 16నుంచి 21వతేదీ ఆలయ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు.

నేలకొండపల్లి: నేలకొండపల్లి బైరాగుల గుట్ట శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం, సింగారెడ్డిపాలెం శ్రీరామ మందిరం, కొత్తకొత్తూరులోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, మండ్రాజుపల్లి కొత్తూరులోని శ్రీకోదండరామాలయం, బోదులబండలోని శ్రీహనుమత్ఆలయం, మూటాపురం శ్రీరామాలయం ముస్తాబయ్యాయి. భక్తరామదాసు ధ్యాన మందిరం సుందరంగా ముస్తాబయ్యింది.

తిరుమలాయపాలెం: సుబ్లేడు, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, రఘునాధపాలెం, కాకరవాయి, గోపాలపురం, పాతర్లపాడు , బీరోలు, బచ్చోడు తదితర గ్రామాల్లోని ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.

వైరా: శ్రీరామనవమి వేడుకలకు మండలంలోని ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. గొల్లపూడి సమీపంలోని పొలాల మధ్య ఉన్న శ్రీపులిగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా తరలి రానున్న వేలాదిమంది భక్తులతో జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వైరాలోని కోదండ రామాలయం, సాయిబాబా మందిరాలు, అయ్యప్పఆలయం సహ మండలంలోని అన్ని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు పలుచోట్ల ప్రత్యేకంగా అలకరించారు.

అవకాశమిస్తే అభివృద్ధికి కృషి

బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

తల్లాడ, ఏప్రిల్ 16: ఖమ్మం ఎంపీగా తనకు అవకాశం కల్పిస్తే అభివృద్ధికి కృషిచేస్తానని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. మంగళవారం తల్లాడ మండలంలోని మల్లవరం, బాలపేట, అన్నారుగూడెం, బిల్లుపాడు, వెంగన్నపేట గ్రామాల్లో ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నాయకులు శ్యామ్‌రాథోడ్, సుదర్శన్‌మిశ్రా, నాయుడు రాఘవరావు, మధు, చావా కిరణ్, ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కల్లూరు: కేంద్రంలో బీజేపీతోనే రామరాజ్యం ఏర్పడుతుందని తాండ్ర వినోద్‌రావు అన్నారు. మండలంలోని కల్లూరు, పుల్లయ్యబంజరు, లోకవరం గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పుల్లయ్యబంజరు గ్రామంలో పసుపులేటి సుబ్బారావు ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరగా వారికి వినోద్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమలో రామాలింగేశ్వరారావు, పార్టీ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు గుమ్మ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి టి.పెద్దపుల్లారావు, గుండపనేని అనిల్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఏ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలన్నీ గాలిలోనే..

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వర రావు

ఎర్రుపాలెం, ఏప్రిల్16: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ గాల్లోనే ఉన్నాయని, బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ రాష్ట్రంగా ఉంటే.. కాంగ్రెస్ పాలనలో సంక్షోభ రాష్ట్రంగా మారిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరావు అన్నారు. మండలంలోని జమలాపురంలోగల వాసిరెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 ఏళ్లలో ఎన్నడూ లేని కరెంటు, ఎన్నడూ రాణి నీళ్లు, ఎన్నడూ పండని పంట రైతులు చూసారని, రుణమాఫీ చేస్తానని రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. రైతులను, యువకులను, మహిళలను, దళితులను అవమానిచ్చిన కాంగ్రెసను నిలదీయాలని అన్నారు. కాంగ్రెస్ మోసాన్ని.. బీఆర్ఎస్ అవసరాన్ని కార్యకర్తలు వివరించాలని పిలుపునిచ్చారు. గతంలో ఎర్రుపాలెం మండలంలో నాకు మంచి మెజార్టీ ఇచ్చారని, ఈసారి ఇంకా రెట్టింపు మెజారిటితో గెలిపిస్తే కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్టీజిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతమధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, జిల్లా నాయకులు కొండబాల కోటేశ్వరరావు,చావా రామకృష్ణ, జడ్పీటీసీ శీలం కవిత సొసైటీ చైర్మన్ మూల్పూరి శ్రీనివాసరావు, మండల అధ్యక్షడు పంబిసాంబశివరావు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ గౌతమ్

రఘునాధపాలెం, ఏప్రిల్16: ఉపాధి హామీ సీజన్ పూర్తయ్యే వరకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రఘునాధపాలెం మండలంలోని వేపకుంట్ల, గణేశ్వరం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పనులను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ మస్టర్లను తనిఖీ చేశారు. వసతులను గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉపాధి కూలీల రక్షణకు ఏర్పాట్లు చేయాలన్నారు. మంచినీళ్ల సౌకర్యంతో పాటు టెంట్లు వేసి వారికి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, డీఆర్‌డీఏ సన్యాసయ్య, అదనపు పీడీ శిరీష, ఖమ్మం క్లస్టర్ ఏపీడీ శ్రీదేవి, డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీడీవో అశోక్ కుమార్, ఎంపీవో శ్రీనివాసరెడ్డి, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి మీనాక్షి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఆయిల్‌ఫామ్ నర్సరీని సందర్శించిన ఆయిల్‌ఫెడ్ ఎండీ

సత్తుపల్లి, ఏప్రిల్16: సత్తుపల్లి మండలం రేగళ్లపాడులోని ఆయిల్‌ఫామ్ నర్సరీని ఉద్యానవన శాఖ డైరెక్టర్, ఆయిల్‌ఫెడ్ ఎండీ కే.అశోక్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల సంఖ్య, నాణ్యత వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ 7.18లక్షల మొక్కలను పెంచుతున్నట్లు, వీటిలో 2.5లక్షల మొక్కలు వచ్చే జూన్, జులై నెలల్లో రైతులకు పంపిణీ చేయనున్నామని స్థానిక అధికారులు వివరించారు. 4.68లక్షల మొక్కలు డిసెంబర్ నాటికి తయారవుతాయని, జిల్లాలో 10వేల ఎకరాలలో ఆయిల్‌ఫామ్ సాగు విస్తీర్ణం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు అశోక్‌రెడ్డికి వివరించారు. రైతులకు నాణ్యమైన మొక్కలను మాత్రమే అందించాలని, ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

ఖమ్మంఖానాపురం హవేలి, ఏప్రిల్16: ఖమ్మంనగరం మామిళ్లగూడెంలోని డీఆర్ఎస్ డిగ్రీకళాశాల 28వ వార్షికోత్సవం మంగళవారం బైపాస్‌రోడ్‌లోని ఎంబీ గార్డెన్ ఫంక్షన్‌హాల్లో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ తేనే నాగేశ్వరరావు వార్షిక నివేదికను సమర్పించారు. కళాశాల కరస్పాండెంట్ వి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వయంకృషితో అభివృద్ధి చెందాలన్నారు. సినీహీరోలు, క్రికెటర్స్ అందరు స్వయం కృషితో పైకి వచ్చిన వారేనన్నారు. దృఢ సంకల్పం ముందు అపజయం నిలువదని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ తెలుగు శాఖాధిపతి జర్పుల రమేష్ హాజరయ్యారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాగేశ్వరరావు

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పొంగులేటి

కూసుమంచి, ఏప్రిల్ 16: గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేస్తామని, క్రీడాకారులను ప్రోత్సహిస్తామని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కూసుమంచి మండలం జీళ్ల చెరువు గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని పొంగులేటి యువసేన కమిటీ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో తన సోదరుడు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రసాదరెడ్డితో కలిసి పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకున్న మంత్రి.. ఫైనల్ పోటీలను కొద్దిసేపు తిలకించారు.

గోశాలలకు గడ్డి వితరణ



సత్తుపల్లి, ఏప్రిల్16: వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు మేరకు రైతులు స్పందించి ఖమ్మం గోశాలకు వరిగడ్డిని విరాళంగా ఇచ్చారు. మంగళవారం సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన 40 ట్రాక్టర్లను ఎమ్మెల్యే మట్టా రాగమయి జెండా ఊపి ఆమె ప్రారంభించారు. మూగజీవాలకు వరిగడ్డిని వితరణగా అందించినందుకు ఎమ్మెల్యే అభినందించారు.

మిషన్ భగీరథ కార్యవర్గం ఎన్నిక

కొణిజర్ల, ఏప్రిల్16: మిషన్ భగీరథ జిల్లా ఐఎన్‌టీయుసీ కార్యవర్గాన్ని మంగళవారం కొణిజర్లలో ఎన్నుకున్నారు. ఖమ్మం అధ్యక్షుడైన నరాల నరేష్ మోహన్‌నాయుడు అధ్యక్షతన జిల్లా మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ సమావేశం నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కొత్త సీతారాములు, అధ్యక్షుడిగా వేల్పుల అనంతరాములు, ఉపాధ్యక్షుడిగా జంగం నరసింహరావు, వీరస్వామి, ప్రధానకార్యదర్శిగా బాలకృష్ణ తదితర కమిటిని ఎన్నుకున్నారు. కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడుతామని ఈ సందర్భంగా నాయకులు హామీ ఇచ్చారు.

ముప్వా దంపతుల పూజలు



సత్తుపల్లిరూరల్, ఏప్రిల్16: టీఎస్ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ ముప్వా విజయబాబు, శ్రీవల్లి దంపతులు మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని జవహర్ నగర్‌లో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి తమవంతు సహకారం ఉంటుందని ముప్వా తెలపగా దేవాలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గుంజా వెంకటేశ్వరరావు, మిద్దే రామకృష్ణ, ఉప్పు హనుమంతు, చెన్నారావు, దేవళ్ల శ్రీను, గట్టె వాసు, మాధవరావు, బాబీ, కన్నెపోగు వెంకటేశ్వరరావు, శైలజ, పద్మ, రమాదేవి, గురవమ్మ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ఖమ్మం సాంస్కృతికం,ఏప్రిల్16: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంలోని శుక్రవారపేటకు చెందిన దూలం సరస్వతి అనే నిరుపేద మహిళకు కుట్టుమిషన్‌ను బహూకరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తల్లపురెడ్డి క్రిష్టారెడ్డి, కార్యదర్శి వేముల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మంసాంస్కృతికం,ఏప్రిల్16: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్సీ (విహే)ఆధ్వర్యంలో ఈనెల 18నుంచి ఏసీ ఇన్స్టాలేషన్ తరగతులను నిర్వహిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని విహే ఫౌండర్ దేవకి వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

ఖమ్మం రూరల్, ఏప్రిల్16: మండల పరిధిలోని ఎమ్ వెంకటాయపాలెంలో మంగళవారం జరుగుతున్న ఉపాధి పనులను ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య పరిశీలించారు. ఎండతీవ్రత నుండి రక్షణకోసం పనిప్రదేశంలో కూలీలకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

యోగాపై అవగాహన సదస్సు

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 16: మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో సహజ యోగా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్గనైజేషన్ బాధ్యులు చెరుకూరి లక్ష్మీ, రాసాల నాగలక్ష్మీ ఆసనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఝాన్సీరాణి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

కల్లూరు,ఏప్రిల్16: కల్లూరులోని చంద్రుపట్ల రహదారి వైపున మట్టా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్ర కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు ఆధ్వర్యంలో బాటసారులకు, ప్రయాణీలకు మంగళవారం ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. బండి కృష్ణ జన్మదినం సందర్భంగా ఈ మజ్జిగను అందజేశారు. మట్టా యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఈ వేసవి సీజన్ వరకు కొనసాగనున్నది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, టీడిపి నాయకులు దారా రంగా, కట్టా గోపాలరావు, యాసా శ్రీకాంత్, దేవరపల్లి వెంకటేశ్వరరావు, తాళ్ల వెంకటేశ్వరరావు, ఎస్‌కే ఉస్మాన్, ఎనుముల రాము, భైర్ల కాంతరావు, విజయరావు, నల్లగట్ల కిషోర్, తండు రాములు కంభంపాటి పుల్లా చారి తదితరులు పాల్గొన్నారు.

వేద పండితులకు సన్మానం

ఖమ్మంసాంస్కృతికం, ఏప్రిల్16: భారతీ తీర్థ మహాస్వామి ఆశ్రమ స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న వేద పండితులకు మంగళవారం మామిళ్లగూడెంలోని గాయత్రి భవనంలో సన్మానించారు. కీసర వేదపాఠశాల అధ్యాపకుడు ద్వాదశి ప్రభాకరశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వడ్లమాని లక్ష్మీనారాయణ, కోదండ రామాచార్యులు, తదితర వేద పండితులను ఘనంగా సన్మానించారు. భ్రమరాంబికా రామలింగేశ్వర దేవాలయ ధర్మాధికారి సర్వదేవభట్ల సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవం

తల్లాడ, ఏప్రిల్ 16: తల్లాడ మండలం కేశ్వాపురం గ్రామంలో సీతారామాంజనేయస్వామి దేవాలయం వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వనిగండ్ల అలేఖ్య అశోక్, దేవాలయ కమిటీ చైర్మన్ కట్టా రమాకాంత్, ఆలయ కమిటీ సభ్యులు వనిగండ్ల పిచ్చయ్య, కోటేశ్వరరావు, చావా తిరుమల రావు, విష్ణువర్ధన్, సాదం రమేష్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల అభివృద్ధికి అండగా నిలుస్తున్న బీజేపీ

వైరా,ఏప్రిల్16: బీజేపీ ప్రభుత్వం దేశంలో కార్పొరేట్ సంస్థల అభివృద్ధికి అండగా నిలుస్తోందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు మేరకు సోమవారం రాత్రి మండలంలోని గొల్లెనపాడులో నిర్వహించిన రైతుసంఘ కార్యక్రమంలో మాట్లాడారు. రైతుసంఘం నాయకులు కిలారు శ్రీనివాసరావు, ఆళ్ల శ్రీనివాస్, నల్లమోతు వెంకటనారాయణ, రాజాబాబు, కంచర్ల శ్రీనివాసరావు, కొణిదన ధర్మారావు, పద్మ, నాగమణి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

కల్లూరు, ఏప్రిల్16: మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు రూ.3 లక్షల అంచనాతో బోర్‌వెల్ నిర్మాణం, విద్యుత్ మోటార్లు మంగళవారం ఏర్పాటు చేశారు. చంద్రుపట్లలో మంచినీటి సమస్యను ఎంపీటీసీ కుక్కా నాగమ్మ, కాటంనేని బాబురావు, ముకర విజయరావు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి పై విధంగా మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు అనుసంధానంగా ఈ బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. ఈబోరువెల్ ఏర్పాటు పట్ల స్థానికులు ఎమ్మెల్యే రాగమయికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అప్పారావు, వేలాద్రి, ఇనుపనూరి ముత్తయ్య, పరిగడపు వెంకటేశ్వరరావు, ఆర్ నరిసింహారావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రుపట్లలో బోర్‌వెల్ వేసిన దృశ్యం

వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్16: సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో నిరుద్యోగ యువతలో స్కిల్ డవలప్‌మెంట్ ట్రైనింగ్‌లో భాగంగా 38కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కిష్టారం పీవో ఎంవీ.నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రోన్ టెక్నీషియన్, సెల్‌ఫోన్ టెక్నీషియన్, కంప్యూటర్ ట్రైనింగ్, ఎల్ఎంవీ డ్రైవర్ ట్రైనింగ్, మహిళలకు ప్రత్యేకంగా టైలరింగ్, కాస్మెటోలజీ, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ కోర్సులు కూడా ఉన్నట్లు తెలిపారు. అసక్తి కలవారు కిష్టారం, జేవీఆర్ ఓసీ మైన్సులో (వీటీసీ) వృత్తి శిక్షణ కేంద్రం, సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించ వచ్చునని తెలిపారు. ఆసక్తి కలవారు సింగరేణి మైన్ వెబ్‌సైట్‌లో ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కూలీ రేట్లు పెంచాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్16:గ్రానైట్, మార్బుల్ షాపుల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల కూలిరేట్లు పెంచాలని ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామయ్య డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల నిరవధిక సమ్మె చేస్తున్న నేపథ్యంలో మంగళవారం నగరంలో సమావేశం నిర్వహించారు. యాజమాన్యాలు తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఇఫ్టూ జిల్లా కార్యవర్గసభ్యులు లాల్‌మియా, తిరుపయ్య, దాసు, నాగరాజు పాల్గొన్నారు.

పథకాలపై మాట మారుస్తున్న కాంగ్రెస్

బీఆర్ఎస్ సత్తుపల్లి మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు



సత్తుపల్లి, ఏప్రిల్16: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన పథకాల అమలులో రాష్ట్ర ప్రజలను మభ్య పెడుతోందని బీఆర్ఎస్ సత్తుపల్లి మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట మార్చి ఆగస్టు 15వ తేదీ నాటికి రుణమాఫీ చేస్తామంటూ పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రకటనలు చేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. వంద రోజులలో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మహిళలకు రూ.2500లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రూ.500లకే వంట గ్యాస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు పథకాలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్‌గా పోటీచేస్తా

తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర సమన్వయకర్త మద్దిశెట్టి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్ 16: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర సమన్వయకర్త మద్దిశెట్టి అజయ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతం పేరుతో బీజేపీ, ప్రాంతం పేరుతో బీఆర్ఎస్, కులం పేరుతో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు అడుగుతున్నారన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

మధిరటౌన్, ఏప్రిల్16: ప్రింటింగ్ ప్రెస్, కల్యాణ మండప నిర్వాహకులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని మధిర తహసీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మధిర తహసీల్దార్ కార్యాలయంలో ప్రింటింగ్ ప్రెస్, కళ్యాణమండప నిర్వాహకులతో మాట్లాడారు. కరపత్రాలు, పోస్టర్ల పై ప్రతుల సంఖ్య, ప్రచురణ కర్త పేరు, సెల్ నెంబరు, ప్రింటింగ్ ప్రైస్ పేరు తప్పనిసరిగా ఉండాలని ముద్రించిన తరువాత వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అందచేయలని తెలిపారు. కల్యాణమండప నిర్వాహకులు మే13 వరకు రాజకీయ సభలు, సమావేశాలకు అనుమతి తీసుకోకుండా ఇవ్వకూడదని తెలిపారు.